ప్రజాశక్తి
మంగళవారం 6 ఆగస్టు 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





కృష్ణా తీరానికి ముంపు బెడద

పులిచింతల ఎగువ, దిగువన అప్రమత్తం చేసిన అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కృష్ణా తీర ప్రాంతానికి ముంపు బెడద పొంచి ఉంది. ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం వస్తుండటంతో ఏకకాలంలో నాగార్జున సాగర్, పులిచింతల గేట్లను వదిలి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖ అధికారులు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల అధికారులకు సమాచారం అందించారు.

సాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ప్రస్తుతం పులిచింతల నుంచి వచ్చిన నీరు వచ్చినట్టు విడుదల చేస్తుండటంతో ప్రకాశం బ్యారేజి గేట్లుకూడా మంగళవారం ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. పట్టిసీమ నుంచి ప్రకాశం బ్యారేజికి వస్తున్న గోదావరి జలాల విడుదలను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే కాల్వలకు 10,159 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ప్రస్తుతం 3.23 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 1.63 లక్షల క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. పులిచింతలలో ప్రస్తుతం ఆరు టీఎంసీల నీరు ఉండగా మంగళవారం సాయంత్రం కల్లా 20 టీఎంసీలు నిల్వ చేరవచ్చునని అంచనా వేస్తున్నారు. పులిచింతల నుంచి నీటి విడుదల ప్రవాహం భారీగా పెరిగితే ప్రకాశం బ్యారేజి ఎగువ, దిగువన పలు గ్రామాలు ముంపునకు గురికానున్నాయి.



సాగర్‌కు ఎగువ నుండి వస్తున్న నీరు

పల్నాడు జిల్లాలోని దాచేపల్లి నుంచి అమరావతి వరకు, గుంటూరు జిల్లాలోని తుళ్లూరు నుంచి కొల్లిపర వరకు, బాపట్ల జిల్లాలోని కొల్లూరు నుంచి రేపల్లె వరకు మొత్తం 14 మండలాల పరిధిలో దాదాపు 50 లంక గ్రామాలకు ముంపు సమస్య ఏర్పడనుంది. గతేడాది వర్షాలు సరిగా లేక, ఆల్మట్టి నుంచి వరద ప్రవాహం రాకపోవడం వల్ల ముంపు సమస్య రాలేదు. శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం రావడంతో సోమవారం ఉదయం 16 గేట్లు ఎత్తారు. ఎగువ నుంచి ప్రవాహం మరింత పెరిగితే సాగర్ జలాశయం మొత్తం గేట్లు ఎత్తి భారీ స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం శ్రీశైలంకు ప్రవాహం యథాతథంగా కొనసాగుతుండటం వల్ల మంగళవారం కల్లా పులిచింతల జలాశయానికి భారీ వరద వచ్చే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో పులిచింతల ఎగువ, దిగువన ముంపు సమస్య రానుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముంపు సమస్య ఉత్పన్నం అయితే ఇప్పటికే సాగులో ఉన్న వరి, పత్తి, మిర్చితో పాటు ఉద్యాన పంటలకు నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా పులిచింతల ఎగువ, దిగువన కృష్ణా తీర గ్రామాల్లో ఇప్పటికే సాగు చేసిన పత్తిపంట నీటమునిగే అవకాశం ఉంది. డెల్టా ప్రాంతంలో వరి, పసుపు, ఇతర ఉద్యాన పంటలు నీట మునిగితే రైతులకు నష్టం జరుగుతుందని సర్వత్రా ఆందోళన నెలకొంది. రెండేళ్ల తర్వాత కృష్ణా పరివాహక ప్రాంతానికి తిరిగి వరద సమస్య ఏర్పడింది.

పానీపూరి వ్యాపారికి రాష్ట్రపతి ఆహ్వానం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని బాలాజీరావు పేటకు చెందిన పానీపూరి బండి నిర్వహించే మెఘావత్ చిరంజీవికి న్యూఢిల్లీలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఆహ్వానం అందింది. ఆహ్వాన ప్రతిని పోస్ట్ ద్వారా అందుకున్నట్లు చిరంజీవి సోమవారం తెలిపారు. వ్యాపార వృద్ధికి జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ కింద పురపాలక పట్టణ పేదరిక నిర్మూలన విభాగం 2021లో రూ.10 వేలు, 2022లో రూ.20 వేలు, 2023లో రూ.50 వేల చొప్పున రుణాలిచ్చింది. బకాయిలను సకాలంలో చెల్లించడంతోపాటు డిజిటల్ రూపంలో నగదు లావాదేవీలు నిర్వహించినందుకు ప్రోత్సాహకంగా ఈ ఆహ్వానం అందినట్లు చిరంజీవి చెప్పారు. అరుదైన ఆహ్వానం అందుకోవటం తెనాలి వాసిగా ఆనందంగా ఉందన్నారు. తనకు ఆహ్వానం పంపిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఆహ్వాన పత్రాన్ని చూపుతున్న చిరంజీవి



నీటి విడుదలకు స్విచ్ఆన్ చేస్తున్న అధికారులు (వార్త మెయిన్‌లో)

నాగార్జునసాగర్ గేట్లు ఎత్తివేత

16 గేట్ల ద్వారా 1.13 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల



సిఎంతో కలెక్టర్ల సమావేశానికి నాగలక్ష్మి, అరుణ్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో వెలగపూడి సచివాలయంలో సిఎం చంద్రబాబు సోమవారం నిర్వహించిన సమావేశానికి గుంటూరు, పల్నాడు జిల్లాల అధికారులు హాజరయ్యారు. గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన సమావేశానికి గుంటూరు ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్, పల్నాడు ఎస్‌పి కె.శ్రీనివాసరావు హాజరయ్యారు. ప్రభుత్వం తన లక్ష్యాలను జిల్లా కలెక్టర్లకు వివరించింది. తాను త్వరలో ఆకస్మిక తనిఖీలకు వస్తానని, అధికారులు పరిపాలనపై దృష్టి పెట్టి పేదలకు మేలు చేకూర్చే ఆలోచనలు చేయాలని సిఎం చంద్రబాబు చెప్పారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, మంత్రులు కలెక్టర్లు, ఎస్‌పిలకు వివిధ అంశాలపై దిశా నిర్దేశం చేశారు.



గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి



నరసరావుపేటలో పల్నాడు కలెక్టరేట్ ఎదుట ధర్నా.. డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు (ఇన్‌సెట్)

స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులపై వేధింపులు మానుకోకుంటే ఉధృత ఉద్యమం

గుంటూరు, పల్నాడు కలెక్టరేట్ల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు - గ్రీవెన్స్‌లో అధికారులకు వినతులు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

యానిమేటర్లు, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, ఆశ, అంగన్వాడి తదితర స్కీమ్‌వర్కర్లపై కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని కోరుతూ గుంటూరు, పల్నాడు కలెక్టరేట్‌ల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నాలు చేశారు. గ్రీవెన్స్‌లో వినతిపత్రాలు ఇచ్చారు. గుంటూరు ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ 20 ఏళ్లుగా పనిచేస్తున్న స్కీం వర్కర్లపై రాజకీయ ముద్రలు వేసి తొలగించడం సరైంది కాదన్నారు. టిడిపి కూటమి వస్తే తమ బతుకులు బాగుపడతాయని స్కీం వర్కర్లు ఆశపడ్డారని, వారి ఆశలను వమ్ముచేస్తూ నిర్దాక్షిణ్యంగా ఉద్యోగాలు ఊడగొట్టి ఇళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. గ్రామస్థాయి నాయకుల నుంచి, ఎమ్మెల్యేల వరకు తమ వారిని ఉద్యోగంలోకి పెట్టుకోవాలంటూ ఇప్పటికే పనిచేస్తున్న వారిని బలవంతంగా రాజీనామాలు చేయించడం, లేకపోతే బెదిరింపులకు పాల్పడటం రివాజుగా మారిందని అన్నారు. కొద్దిమంది అధికారులు కూడా రాజకీయ నాయకుల మెప్పుకోసం ఉద్యోగులపై ఒత్తిళ్లు తెస్తున్నారని విమర్శించారు. బంధువుల్లో ప్రతిపక్ష పార్టీకి చెందిన వారున్నా ఆయా యానిమేటర్లను తొలగించారన్నారు. రాజకీయ నాయకులు మాత్రం ఒకే కుటుంబానికి సంబంధించిన వాళు వివిధ పార్టీల్లో పదవులు పొందుతున్నారని, చిరుద్యోగులు మాత్రం రాజకీయాలతో సంబంధం లేకున్నా, వారి బంధువులు రాజకీయాల్లో ఉన్నారని ఉద్యోగుల్ని తొలగించటం శోచనీయమని అన్నారు. వేధింపులు పాల్పడబోమని ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు చెబుతున్న మాటలు కిందిస్థాయిలో నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని అన్నారు. స్కీమ్ వర్కర్లైన అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజనం కార్మికులను ఇళ్లకెళ్లి బెదిరించడం 2లో



పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరిస్తున్న సూరజ్

యూనివర్సల్ ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా శుభారంభం

ప్రజాశక్తి - మేడికొండూరు



మాట్లాడుతున్న ఫాదర్ పి. బాలస్వామి.

మండలంలోని పేరేచర్ల నరసరావుపేట రోడ్డులోని యూనివర్సల్ ఇంజనీరింగ్ కాలేజ్ లో సోమవారం ఘనంగా ఫ్రెషర్స్ డే శుభారంబ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ ఫాదర్ పి బాలస్వామి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన విద్యను పంది పుచ్చుకొని ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం దిశగా ముందుకు రాణించాలని అన్నారు. ఉన్నత ఉద్యోగాల కొరకు ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఆదర్శవంతంగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో వివిధ బ్రాంచ్లలో నూతనంగా జాయిన్ అయిన విద్యార్థులకు కొన్ని రకాల సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరెడ్డి మాట్లాడుతూ, అటానమస్ యొక్క ప్రాముఖ్యతను వివరించి, కళాశాలలో ప్రతిభ గల విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పనపై తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డీన్ కే విజయ్ కుమార్, సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగాధిపతి ఏ ఇన్నారెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం జయరామిరెడ్డి, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ ఎమ్ కోటిరెడ్డి వివిధ విభాగాల అధిపతులు అధ్యాపక సిబ్బంది, పాల్గొన్నారు.

విశాఖ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు కోటేశ్వరరావుకు మాతృవియోగం

ప్రజాశక్తి -పొన్నూరు



తుమ్మల కోటేశ్వరరావు ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

పొన్నూరు పట్టణంలోని 14వ వార్డుకు చెందిన విశాఖ ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు తుమ్మల కోటేశ్వరరావు మాతమూర్తి తుమ్మల అచ్చిమాంబ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు . సోమవారం నిర్వహించిన పెదకర్మ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటుచేసిన సంతాప సభలో ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొని అచ్చిమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిడుబ్రోలు టిడిపి అధ్యక్షులు జాగర్లమూడి సుధీర్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల అసహనం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు ఎండలోనే నిలబడాల్సి వచ్చింది. ఎండలోనే క్యూలో నిలబడిన అర్జీదారుల్లో మహిళలు, పురుషులు, వృద్ధులు కూడా ఉన్నారు. తమ పిల్లలతో సహా ఇక్కడికి వచ్చిన వారు లేకపోలేదు. అర్జీదారులు ఎండ బారిన పడకుండా ఉండేందుకు ఎటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అర్జీదారులు నిలబడ్డారు. ఎండకు తాళలేక కొంతమంది మహిళలు తమ చీర చెంగులను, పురుషులు తమ వెంట తెచ్చుకున్న టవల్స్‌ను తలపై ఉంచుకున్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన తమకు వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారంటూ ఎండల్లో నిలబడ్డ అర్జీదారులు అసహనం వ్యక్తం చేశారు.



పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఎండలో నిలబడ్డ అర్జీదారులు

వినుకొండ-గుంటూరుకు మధ్య నాలుగులైన్ల రహదారి

జాతీయ రహదారుల సంస్థ అనుమతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైనిర్మాణంలో భాగంగా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ వినుకొండ నుంచి గుంటూరుకు తొలిదశలో నాలుగు లైన్ల రహదారి నిర్మాణం కోసం రూ.2360 కోట్లను కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు నుంచి వినుకొండకు 90 కిలో మీటర్ల మేర రహదారిని ఆరు లైన్లుగా విస్తరింపచేసేందుకు ఈ నిధులు వెచ్చిస్తారు. ఈమేరకు దేశ వ్యాప్తంగా జాతీయ రహదారుల సంస్థ విడుదల చేసిన ఈ జాబితాలో వినుకొండ రోడ్డుకు కూడా స్థానం దక్కింది. ఇందుకోసం భూసేకరణకు కూడా మరో రూ.1185 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. ఇప్పటి వరకు కేవలం రెండు లైన్ల రహదారి మాత్రమే ఉండగా దీనిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరింపచేసేందుకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అనుమతి ఇచ్చింది. ఈ పనులకు త్వరలో టెండర్లు పిలుస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

సెప్టెంబర్ 15 లోపు ఈ పంట నమోదు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న బెల్లంకొండ మండల వ్యవసాయ శాఖాధికారి డి. కృష్ణయ్య

ప్రజాశక్తి-బెల్లంకొండ

బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులకు, రైతు సేవా కేంద్రంలో పనిచేసే గ్రామ వ్యవసాయ సహాయకులు,గ్రామ ఉద్యాన సహాయకులు,బహుళ ప్రయోజన విస్తరణ అధికారులకు ఖరీఫ్ -2024 ఈ పంట నమోదు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి డి. కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామంలోని అన్ని సర్వే నంబర్లు గ్రామమ్యాపు ఆధారంగా విభజన చేసుకొని రోజువారి, వారం ప్రణాళికలు ఏర్పాటు చేసుకొని క్రమబద్ధంగా ఈ పంట నమోదు సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తిచేయాలని, పంటసాగు చేయు వాస్తవ సాగుదారుని వివరాలు నమోదు చేయాలని, పంట రకము, విత్తిన తేదీ, నీటి వసతి, పంట సరళి తప్పనిసరిగా నమోదు చేయవలసి ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ నుండి అమలు జరుగు అన్ని పథకాలకు కూడా ఈ పంట ప్రామాణికం కానుందని, రైతులందరూ కూడా గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి వివ రాలను వారికి తెలియజేసి పంటనమోదు కార్యక్రమానికి సహకరిం చాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.ఎన్. ఎస్. పవన్ కుమార్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పై అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలములో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈ క్రాప్ నమోదుపై అవగాహన కార్యక్రమం జరిగింది. మండల డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల వ్యవసాయ శాఖ అధికారి మన్నవ నాగరాజు మాట్లాడుతూ నేటి నుండి ఈ పంట నమోదు కార్యక్రమము మండలములో అన్ని గ్రామాలలో జరుగుతుందని తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పకుండా చేసుకోవాలని తెలిపారు. ఈ పంట నమోదు వలన భూ యజమానికి, కౌలుదారునికి ప్రభుత్వము నుండి వచ్చే పథకా లైన క్రాప్ ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ పథకాలు, మార్కెటింగ్ మొదలగునవి వర్తిస్తాయి అని తెలిపారు. ఇప్పటివరకు మన మండలములో వరి - 187 ఎకరాలు, ప్రత్తి - 5484, మినుము - 55, పసుపు - 108, పచ్చిరొట్టె ఎరువులు - 1490 ఎకరాలు వేయబడ్డాయి. మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న రైతులు కౌలు రైతులు తమ పంట పొలాలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వీఆర్వోలు ,వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి నాగరాజు

వేధింపులు మానుకోకుంటే ఉధృత ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికైనా మానుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాకు అధ్యక్షత వహించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన స్కీమ్ వర్కర్లపై వేధింపులు ఆగకపోగా పెరుగుతున్నాయన్నారు. గుంటూరు జిల్లాలో దాదాపు 200 మందిని తొలగించారని తెలిపారు. ధర్నా అనంతరం గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు.

పల్నాడు కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ అతి తక్కువ గౌరవ వేతనంతో విశేష సేవలందిస్తున్న అంగన్వాడీల, ఆశా, యానిమేటర్లు, ఆర్‌పిలు, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులపై రాజకీయ వేధింపులేమిటని నిలదీశారు. వీరినేదో టిడిపి నాయకులే జీతాలిచ్చి పోషిస్తున్నట్లుగా ప్రవర్తిస్తున్నారని, ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ చిరుద్యోగులపై వేధింపులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఇదే తరహా వేధింపులకు పాల్పడితే యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమించి అడ్డుకున్నామని గుర్తుచేశారు.

కొన్ని రోజుల క్రితం యూనియన్ రాష్ట్ర నాయకులు సిఎం చంద్రబాబును కలిసి రాజకీయ వేధింపుల గురించి వివరించగా ఇలాంటివి తన దృష్టికి రాలేదంటూ ఆయన చెప్పారని, స్కీమ్ వర్కర్లకు ఇబ్బందు ల్లేకుండా చూస్తామని హామీనిచ్చారని తెలిపారు. ఎన్నికల హామీ ప్రకారం సుపరిపాలన అందిస్తూ స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వేధింపులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు ధర్నాలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్తి, ఎవిఎన్ కుమారి, యానిమేటర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుణ, ఆర్పీల యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి రమాదేవి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, రామచంద్రయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు, వివిధ సంఘాల నాయకులు ఎన్.శివాజీ, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పల్నాడు ధర్నాలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, అంగన్వాడి యూనియన్ నాయకులు సాయికుమారి, సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, నాయకులు పి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అల్లాబక్షు, రాజకీయ వేధింపులు, తొలగింపులకు గురైన స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు 3
మంగళవారం 6 ఆగస్టు 2024

ఉండవల్లిలో ఇసుక లారీలు పట్టివేత

- అతి వేగంతో భారీ వాహనాలు
- ఓ మూగజీవి ప్రాణాలు బలి
- గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-తాడేపల్లి



రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉన్న ఉండవల్లిలో భారీ వాహనాలు ఇసుక రవాణాతో దూసుకొస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పిల్లలను రోడ్డు మీదకు పంపుదామంటే వణికి పోతున్నారు. అతి వేగంతో భారీ వాహనాలు ఈ మార్గాన పయనించడంతో సోమవారం ఓ మూగజీవి ప్రాణాలు కోల్పోయింది. ఉండవల్లి సెంటర్‌లో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఫలితంగా వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సమాచారం అందుకున్న తాడేపల్లి ఎస్ఐ రమేష్ అక్కడకు చేరుకున్నారు. జామాయిల్ తోట బ్రిడ్జి అవతల లారీలను నిలుపుదల చేశారు. రికార్డులు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించారు. అసలు ఈ మార్గం గుండా భారీ వాహనాల రాకపోకలకు అనుమతి ఉందా లేదా అనేది విచారించి ఉన్నతాధికారుల ఆదేశాలతో తగు చర్యలు తీసు కుంటామని హెచ్చ రించారు. జామా యిల్ తోట నుంచి ఉండవల్లి వరకు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో ఆర్‌టిసి బస్సులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. భారీ వాహనాలు ఈమార్గంలో రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉండవల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.





రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-తాడికొండ : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన తాడికొండ మండలం లాం చలపతి కళాశాల వద్ద సోమ వారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం మండల పరిధిలోని పాములపాడుకి చెం దిన కార్యంశెట్టి సామ్రాజ్యం (55) కొంతకాలంగా అనా రోగ్యంగా ఉన్నారు. వైద్యం నిమిత్తం ఆమె తన కొడుకు సాంబశివ రావు, కోడలు స్వాతితో కలిసి ద్విచక్ర వాహనంపై గుంటూరు బయలు దేరారు. లాం చలపతి కళాశాల దాటిన తర్వాత వెనకవైపు నుండి వేగంగా వస్తున్న గుర్తుతెలియని కారు వీరి వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. సామ్రాజ్యం తలకు తీవ్ర గాయమైంది. సాంబశివరావు, స్వాతికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆటోలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సామ్రాజ్యం మృతి చెందారు. సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ ప్రభాకరరావు తెలిపారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	30,579
మిర్చి ఎగుమతి	:	27,626
మిర్చి నిల్వ	:	19,051

మిర్చి ధరలు

రూపాయలలో

334	8,000 - 17,000
నెం.5	9,000 - 13,000
273	9,500 - 12,500
341	8,500 - 15,000
నాన్ ఎసి	
తేజ	7,500 - 18,500
బడిగి	8,500 - 15,500
దేవనూరు డీలక్స్	9,000 - 13,000
తాలుకాయలు	4,500 - 11,000
ఎసి	
334	9,500 -13,500
341	11,000 - 13,500
4884	12,500 - 12,500
తేజ	8,000 - 18,300
బడిగి	9,000 - 14,000
తాలుకాయలు	6,000 - 10,000



మృతి చెందిన స్నేహితులకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రొంపిచర్ల మండలం విప్పర్ల గ్రామానికి చెందిన యువకుల మృతదేహాలను నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చేతికి అందిన బిడ్డలు అర్ధాంతరంగా తనువు చాలిస్తే ఆ తల్లిదండ్రుల కడుపు కోత భరించలేనిదన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పులిచింతల ప్రత్యేక కలెక్టర్ నారదముని

పల్నాడు కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 85 ఫిర్యాదులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రీవెన్స్ ద్వారా అందిన అర్జీలకు నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని ఐసిడిఎస్ జిల్లా పీడీ ఉమారాణి, పులిచింతల ప్రత్యేక కలెక్టర్ నారదముని, డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి వెంకటరెడ్డి ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లోని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సమావేశ మందిరంలో ప్రజల నుండి వచ్చిన 85 ఫిర్యాదులను స్వీకరించారు. ఉమారాణి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అందిన దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలన్నారు. నిర్దేశించిన సమయం దాటకుండా దరఖాస్తులను పరిష్కరించాలని, నిబంధనల మేరకు లేని దరఖాస్తులను అందుకు గల కారణాలను ధరఖాస్తుదారునికి రాతపూర్వకంగా తెలపాలని చెప్పారు.

బిసి స్టడీ సర్కిల్ ఏర్పాటు కోసం వినతి

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి బాదుగున్నల శీను వినతిపత్రం ఇచ్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బిసి స్టడీ సర్కిల్ గత ప్రభుత్వం మూసివేయడంతో దూర ప్రాంత విద్యార్థులు కోచింగ్ ఫీజులు చెల్లించలేక ఉన్నత ఉద్యోగాల కోసం పోటీ పరీక్షల కోసం పేద బడుగు బలహీన వర్గాలకు చెంది ప్రతిభ కలిగిన యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని చెప్పారు.

22ఎ నుండి భూమి తొలగించాలి

తమకు చెందిన 1.40 ఎకరాల పొలాన్ని దేవాదాయశాఖ భూములకు దగ్గరగా ఉండడంతో తమ భూమిని 22ఎ కింద చేర్చారని, దీన్ని సరిచేయాలని పెదకూరపాడుకు చెందిన రైతు గుంటుపల్లి సాంబశివరావు విన్నవించారు.

ప్రభుత్వం ఇచ్చిన భూమిని ఆక్రమించారు

భూమి లేని పేదలకు యడ్లపాడు మండలం కొండవీడు శివారులో వాగు పోరంబోకు పొలానికి 2005లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, అప్పటినుండి ఇటీవల కాలం వరకు సాగు చేసుకున్నామని, ఇటీవల ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో నివాసం ఉండటాన్ని ఆసరాగా చేసుకుని గుంటూరుకు చెందిన కొత్తపల్లి మురహరరావు యడ్లపాడు రెవిన్యూ అధికారుల ద్వారా నకిలీ పుస్తకాలు సృష్టించి ఇబ్బందులు పెడుతున్నారని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

నీటి విడుదలతోపాటు సాగు ప్రణాళిక ప్రకటించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాగార్జున సాగర్ కుడికాల్వ ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్లో గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ రెండు మూడేళ్లుగా సాగునీరు లేక కుడికాల్వ ఆయకట్టు మాగాణి భూమి పడావుగా పడి ఉందని, కేవలం ఆరుతడి పంటలకు వారబందీ పద్ధతిలో నీరివ్వటం వల్ల మాగాణి ప్రాంతం బీడు భూమిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మాగాని భూములకు నీరు అందించకపోతే భవిష్యత్తులో రైతులు వరి పంటను మర్చిపోయే ప్రమాదం కూడా ఉందన్నారు. దీనివల్ల ప్రజల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందన్నారు. కుడికాల్వకు 132 టీఎంసీల నికర జలాల అనుమతి ఉన్న ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ నెల ఒకటో తేదీ నాడు సాగర్ ఎడమ కాల్వకు తెలంగాణ వారు నీటి విడుదల చేసినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం చూస్తూ ఊరుకుందని విమర్శించారు. సాగునీటిని వెంటనే విడుదల చేసి రైతులకు స్పష్టమైన సాగునీటి ప్రణాళికను ప్రకటించాలని కోరారు. గత మూడు, నాలుగేళ్లుగా కాల్వల్లో మరమ్మతులు చేయని కారణంగా విడుదలైన నీరు కూడా చివరి భూములకు అందడం లేదని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు, నాయకులు చేకూరి సురేష్ రాజా పాల్గొన్నారు.



హెచ్.పి.సి.ఎల్ పైప్‌లైన్ బాధితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

శావల్యాపురం మండలం కారుమంచి, రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామాల్లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ పైప్‌లైన్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించి న్యాయం చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతులు స్పందన కార్యక్రమంలో విన్నవించారు. గోపాలరావు మాట్లాడుతూ బీపీసీఎల్ యాజమాన్యం రైతుల అనుమతి లేకుండా పొలాల్లో అక్రమంగా పైపులైన్ నిర్మాణం చేపట్టటం సరికాదన్నారు. 1967 పెట్రోల్ కెమికల్ చట్టం ప్రకారం కాకుండా రైతులను పరిహారం దారుణంగా వంచించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ పైపులైన్ నిర్మాణం జరిగిన సందర్భంలో రైతులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం భూమికి, పంటకు పరిహారం చెల్లించిందని చెప్పారు. దీనిదృష్ట్యా బీపీసీఎల్ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చించి రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పించాలని కోరారు. లేకుంటే రైతుల ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చేకూరి సురేష్ రాజా, కామినేని రామారావు, మన్నం వెంకటేశ్వర్లు, ఎర్రబిక్కి ఆంజనేయులు, ముప్పాగిరి ప్రసాద్, కొచ్చర్ల కమాల్, ఎడపాలపాటి సురేష్, ఎలుక వెంకటేశ్వర్లు, బనగానపల్లి సుభాని, పిపి.నరేష్, పి.రామబ్రహ్మం పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు విఆర్‌ఎల విన్నపం

ప్రజాశక్తి - అమరావతి

తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎ) డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సీసీఎల్ఏ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు పార్ట్ టైం ఉద్యోగులని, వీఆర్ఏ 2005 సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా నైట్‌వాచ్మెన్ అటెండర్ డ్యూటీలు చేయించరాదని కోరారు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్మెన్ అటెండర్ పోస్టులను తక్షణమే వీఆర్ఏలతో భర్తీ చేయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మాదిరి పే స్కేలు అమలు చేయాలని, అర్హతున్న వీఆర్ఏలకు వీఆర్వోగా వన్ టైం సెటిల్మెంట్ ద్వారా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని కోరారు.

సంఘం మండల కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా నూతన తహశీల్దార్‌ను సత్కరించారు. అనంతరం సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. త్వరలో ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని తీర్మానించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాజు, ప్రధాన కార్యదర్శిగా ఖాజావలి, కోశాధికారిగా రజియా, సహాయ కోశాధికారిగా సువర్ణ, సహాయ కార్యదర్శులుగా దినేష్, జాన్‌సైదా ఎన్నికయ్యారు. సిఐటియు మండల కార్యదర్శి సూరిబాబు, విఆర్‌ఎలు ఖాదర్‌బి, గణేష్, రవి, సువార్త, ఇమాంస, కరిముల్లా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జీవో 117 రద్దు తర్వాతే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : జీవో 117ను రద్దు చేసిన తర్వాతే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల అనుగుణంగా ఉపాధ్యాయులు లేకుండా పోయారని, ప్రాథమిక పాఠశాలలు మూతబడనున్నాయని పేర్కొన్నారు. ఈ జీవోను రద్దు చేస్తామని టిడిపి ఎన్నికలప్పుడు హామీనిచ్చిందని గుర్తు చేశారు. 1 నుండి 5 తరగతులతో ప్రాథమిక పాఠశాలలు ఉండాలని కోరారు. జీవో 117 వల్ల రానున్న కాలంలో డీఎస్సీ పోస్టులు భర్తీ చేయడానికి సైతం ఆటంకాలు ఉన్నాయని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మోడల్ స్కూల్ వ్యవస్థను ప్రాథమిక విద్యలో తిరిగి ప్రవేశపెట్టాలని, 5 తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఒక ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేక ఇంగ్లీష్ బోధకుడితో మండలానికి ఒకటి చొప్పున మోడల్ స్కూల్ నెలకొల్పాలని కోరారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు కాంప్లెక్స్ స్థాయిలో ఆపై మండల స్థాయిలోనే జరగాలని, ఉన్నత పాఠశాలలో ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని, ఉన్నత పాఠశాలలో 6 నుండి 10 తరగుతల వరకు నిర్వహిస్తూ 3, 4, 5 తరగతుల పిల్లలకు ప్రాథమిక పాఠశాలలో తిరిగి పంపుతూ గత ప్రభుత్వంలో జరిగిన విద్య రంగంలో నష్టాలను నివారించాలని కోరారు.

ఆపదలో ఉన్న వాయ్‌నాడ్ బాధితులకు అండగా నిలుద్దాం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కష్టాల్లో చిక్కుకున్న కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య కోరారు. సోమవారం పట్టణంలోని వీధివీధిన పర్యటించి ఆర్థిక విరాళాలు సేకరించారు. ప్రధాన వీధుల్లో చిరు వ్యాపారుల వద్ద, పాదచారుల వద్ద ఆర్థిక సాయాన్ని సమీకరించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ వయనాడ్‌లో భారీ వర్షాలకు కొండచరియలు విరిగి పడి గ్రామాలకు గ్రామాలు కొట్టుకుపోవడంతో వందలాదిమంది చనిపోవడం, గాయపడడం, వేలాదిమంది నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. జనజీవనం స్తంభించిపోయి కకావికలమైన వారికి పునరావాసం కల్పించడానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యలకు,ఎ పునరావాస కార్యక్రమాలకు తోడ్పాటుగా అందరూ తమ వంతు ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, నాయకులు ఎ.వీరబ్రహ్మం, కె.శివదుర్గారావు, పి.ప్రభాకర్, జి.సుసులోవ్, ఎ.వెంకట్ నారాయణ, జి. ఉమశ్రీ, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులో సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. నాయకులు నూతలపాటి కాళిదాసు, ఎం.పద్మారావు, కె.రోశయ్య, జె.శంకర్రావు పాల్గొన్నారు.

ఆర్టీఓ కార్యాలయంలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం

- సిబ్బంది పుష్కలం - సేవలు మృగ్యం
- నెలల తరబడి ప్రజల ప్రదక్షిణలు
- స్పందించని అధికారులు


ట్రక్ ఆటోలో ప్రాధమిక పాఠశాల విద్యార్థుల తరలింపు

ప్రజాశక్తి-తెనాలి

రవాణాశాఖ కార్యాలయంలో నిర్లక్ష్యం రాజ్య మేలుతోంది. పుష్కలంగా సిబ్బంది ఉన్నా పనులు మాత్రం జరగటంలేదు. చిన్న చిన్న పనులకు కూడా నెలలకొద్ది కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. కనీసం సమాధానం చెప్పే పరిస్థితి కూడా లేదు. గుమాస్తా శలవు పెడితే ఎన్నిరోజులైనా ఆ స్థానంలో పనులు అలా నిలిచి పోవాల్సిందే. క్షేత్రస్థాయిలో సమస్యలను ఉన్నతస్థాయి అధికారులకూ తెలియనివ్వరు. అలాగని కార్యాలయ సిబ్బందీ పరిష్కరించరు. దీంతో సందర్శకులు లబోదిబో మంటున్నారు. తెనాలి ఆర్టీవో కార్యాలయంలో కొంత కాలంగా జరుగుతున్న తంతు వివరాలిలా ఉన్నాయి.

తెనాలి రవాణాశాఖ కార్యాలయంలో సిబ్బంది పుష్క లంగా ఉన్నారు. రవాణా శాఖ అధికారితో పాటు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు. గత కొంత కాలంగా డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్ వంటి చిన్నచిన్న పనులు కూడా నెల రోజులుగా పెడింగ్‌లో ఉన్నాయి. విషయం అధికారుల దృష్టికి తీసుకువెళితే గుమాస్తా స్థాయిలో పనే అని చెబుతారు. గుమాస్తా ఎవరంటే శలవులో ఉన్నారంటారు. మరి ఆ స్థానంలో పనుల సంగతి ఏమిటంటే సమాధానం ఉండదు.

గుంటూరుకు చెందిన రైల్వే ఉద్యోగి నెల రోజుల క్రితం డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. రెన్యువల్‌కు సంబంధించిన ఫీజు కూడా చెల్లించారు. అయితే ఆధార్ సీడింగ్ చేయాల్సి ఉందని, అది గుమాస్తా స్థాయిలోనే చేయాలని చెబుతున్నారు. సంబంధిత గుమస్తా శలవులో ఉంటే మరొకరికి ఆ బాధ్యత అప్పగించాల్సిన అధికారులు, ఆదిశగా చర్యలు తీసుకోకుండా ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్నారు. ఓ వ్యక్తి తన వాహనానికి సంబంధించి 15 సంవత్సరాలకు రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కోసం కార్యాలయానికి వచ్చాడు. అయితే ఆ వ్యక్తి వివరాలు ఆన్‌లైన్‌లో లేవు. పైగా గతంలో తను వాహనం కొనుగోలు చేసిన వ్యక్తి వివరాలు న్నాయి. 2012లోనే వాహనాన్ని తన పేరున బదిలీ చేయించుకుని, సి బుక్ తీసుకున్నానని ఆ వ్యక్తి ఆధారలతో సహా చూపుతున్నా అతన్ని రెండు నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. అదేమని ప్రశ్నిస్తే సర్వర్ సమస్యగా చెబుతున్నారు. ఈ సమస్యలు మచ్చుకే. చెప్పుకుంటూ పోతే చాంతాడన్ని సమస్యలున్నాయి. ఇలాంటి పరిణామాలతో సందర్శకులు అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

సరుకు రవాణా వాహనాల్లో విద్యార్థుల తరలింపు

కేవలం రోడ్డు భద్రతా వారోత్సవాల పేరిట అవగాహన సదస్సులు నిర్వహించి రవాణా శాఖ అధికారులు మిన్నకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ప్రమాదాల నియం త్రణకు కట్టుదిట్టమైన చర్యలు లేవు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను తరలించే క్రమం దారుణంగా ఉంది. పరిమితికి మించిన సామర్థ్యంతో విద్యార్థులను తరలిస్తున్న వాహనాలను నిత్యం చూస్తూ కూడా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. చివరకు సరకు రవాణా వాహనాల్లో విద్యార్థులను తరలిస్తున్నా చూసీచూడనట్లే వ్యవహరి స్తున్నారు. ట్రక్ ఆటోల్లో ప్రాధమిక పాఠశాల విద్యార్థులను తరలిస్తున్న క్రమం దారుణంగా ఉంది. రూరల్ గ్రామం కొలకలూరు-ఖాజీపేట గ్రామాల వద్ద ట్రక్ ఆటోల్లో చిన్నారులను తరలిస్తూ, కదలకుండా కూర్చోవాలని గద్దిస్తూ ఆటో నడపటం మరింత ప్రమాదాన్ని శంకిస్తోంది. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమే. అయినా అధికారులు చోద్యం చూసేందుకే పరిమితమౌతున్నారు. ఒకవేళ ఆటోలు ఏదైనా ప్రమాదానికి గురైతే పరిస్థితి ఏమిట్నది ప్రశ్నార్థకం. రవాణా శాఖలో నిబంధలను కఠినతరం చేశామని చెబుతున్న అధికారులు ప్రాధమికంగా అమలు చేయాల్సిన నిబంధనలను విస్మరిస్తున్నారన్న విమర్శలు న్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందిచి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఎంటిఎంసి సంఘం కార్యదర్శి పి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తాడేపల్లి పట్టణంలోని చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్లో ఉండవల్లి పార్థసారధి అధ్యక్షతన పట్టణ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు వృత్తి దారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వృత్తిదారులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. వృత్తికి సంబంధించి అధునాతన పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వృత్తిదారులకు ఇళ్లస్థలాలు లేవని, స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మించడానికి నిధులు కేటాయించాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో మోడరన్ దోభిఘాట్లు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛను మంజూరు చేయాలని, తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న ఐలమ్మ కమ్యూనిటీ హాలు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరారు. ఈ సమావేశంలో ఎం.సుబ్బారావు, కె.యానాదిరావు, వరప్రసాద్, సాంబశివరావు, పి.లక్ష్మీనారాయణ, ఎస్.శివయ్య, వీరాంజనేయులు, పి.బాలకృష్ణ, ఆర్.రాజు, టి.శివయ్య, ఎం.నరసింహారావు, డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వయనాడ్ బాధితులకు అండగా విరాళాల సేకరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్



తెనాలిలో


దుగ్గిరాలలో

కేరళ, వయనాడు వరద బాధితులను ఆదుకోవాలని సోమవారం వామపక్షాల నాయకులు విరాళాలు సేకరించారు. తెనాలి మున్సిపల్ కార్యా లయం నుండి సిపిఎం, సిఐటియు నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి, వివిధ కార్మిక సంఘాల నేతలతో ర్యాలీ నిర్వహించి విరాళాల సేకరణ చేపట్టారు. ప్రజలు స్పందించి తమ విరాళాలు ద్వారా వయనాడు వరద బాధితులను ఆదుకోవాలని బాబుప్రసాద్ ప్రజలను కోరారు. కార్యక్రమంలో ములకా శివ సాంబి రెడ్డి, బొల్లిముంత కృష్ణ, పి జోనేష్, ఎస్ సుబ్రమణ్యం, జి వెంకట సుబ్బయ్య, ఎం సాంబశివరావు, ఎం వెంకటేశ్వర్లు, వి ఫణీంద్ర పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

కేరళ రాష్ట్రంలోని వాయునాడులో బీబత్సం సంభవించి గ్రామాలు వరదలో కొట్టుకుపోయి అపార నష్టం జరిగిందని వరద బాధితులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. సోమ వారం మంచికల పూడిలో కేరళ భాధితుల సహా యార్ధం నిధిని వసూ లు చేశారు. కార్యక్రంలో సిపిఎం నాయ కులు వై స్టాలిన్, యార్ల గడ్డ బ్రహ్మేశ్వ రరావు, పాములు, తనూజ పాల్గొన్నారు.

డంపిండ్ యార్డును తరలించరూ...

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి బ్రహ్మానందపురం సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. డంపింగ్ యార్డు వల్ల ఆ ప్రాంతమంతా మురికికూపంగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే నివశిస్తున్న వేమారెడ్డి కాలనీ వాసులు డంపింగ్ యార్డు వల్ల వస్తున్న దుర్వాసనతో ముక్కు మూసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. అక్కడి వ్యర్థాలను కుక్కలు చిందరవందర చేయడంతో వచ్చే దుర్వాసర వల్ల ఆహార పదార్థాలు కూడా తినలేకపోతున్నామని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు వచ్చి పోయే వారిపై దాడి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. డంపింగ్ యార్డును ఇక్కడ నుంచి తరలించాలని స్థానికులు మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. నివాస ప్రాంతాల పక్కన డంపింగ్ యార్డు ఉండకూడదన్న నిబంధనను మంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి స్థానికులు సిద్ధమయ్యారు.




మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ఐక్యంగా ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-తాడేపల్లి

సీడ్ యాక్సిస్ రోడ్డు కింద భూములు కోల్పోమే రైతులు ఐక్యంగా ఉద్యమిద్దామని తీర్మానించారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో జరిగిన రైతులు ఆ మేరకు తీర్మానించారు. ముఖ్యంగా యు1, గ్రీన్‌జోన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. జోన్లు ఎత్తివేస్తేనే రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వాలా వద్దా అనేది అప్పుడు నిర్ణయిస్తామని తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత మంత్రి నారా లోకేష్ తమ దగ్గరకు వచ్చి తమ ప్రభుత్వం వస్తే అందరి ఆమోదంతో సమిష్టిగా ఓ నిర్ణయం తీసుకుని సీడ్ యాక్సిస్ రోడ్డుపై ముందుకు పోదామని చెప్పిన మాటలను గుర్తుచేశారు. ప్రస్తుత సిఎం చంద్రబాబు రెండు రోజుల క్రితం జరిగిన సిఆర్‌డిఎ సమావేశంలో గతంలో ఇచ్చిన విధంగానే రాజధానిలో ఎక్కడ కోరుకుంటే అక్కడ పరిహారం ఇస్తామని, ఎక్కువ ఇచ్చే ప్రసక్తే లేదని చెప్పడం పట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది మందితో కమిటీ ఏర్పాటైంది. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, పలువురు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


వైద్య సేవలను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఓ


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తుమ్మపూడిలో కొనసాగుతున్న వైద్యశిబిరం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని తుమ్మపూడి గ్రామంలో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉన్నారని డిప్యూటీ డిఎంహెచ్ఓ ఈ అన్నపూర్ణ తెలిపారు. సోమవారం ఆమె గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి జ్వరాల బరిన పడిన వారిని పరామర్శించారు. మండల వ్యాప్తంగా ఉన్న ఏఎన్ఎంలు ఆశ వర్కర్లతో 15 బృందాలను ఏర్పాటు చేసి ప్రతి ఇంటిని సర్వే చేస్తున్నారు. అంతేగాక నీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య కార్య క్రమాన్ని కూడా చేపట్టారు. ఆందోళన చెందవలసిన అవసరం లేదని శిబిరానికి వచ్చిన వారికి రక్త పరీక్షలు వైద్య పరీక్షలు చేసి సెలైన్లు ఎక్కించి వైద్యం అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. జ్వరాలు పూర్తిగా తగ్గేవరకు శిబిరం కొనసాగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఇజాజ్ అబ్దుల్ రెహమాన్ డాక్టర్ ఇందిరా గ్రామ సర్పంచ్ ఎస్కే అజీజ్ జూన్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా చూడాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్ అధి కారుల మీద ఉందని లోక్సత్త ప్ఆర్తి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భాను ప్రసాద్ సో మ వారం ఒక ప్రకటనలో అన్నారు. పట్టణంలో శివారు ప్రాం తాలతో సహా ఖాళీ స్థలాల్లో, వెంచర్స్ లో రాత్రి వే ళల్లో మందు బాబులు యథేచ్ఛగా మద్యం తాగే కేంద్రాలుగా మార్చేస్తున్నా రని, భవిష్యత్తులో ఇవి ఇలాగే కొనసాగితే నే రాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు బహి రంగ ప్రదే శాల్లో సిట్టింగులపై తగు చర్యలు తీసుకోవాలని, అక్క డక్కడ మద్యం సేవించి గొడవలు పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, కొన్ని బయటకి రావడంలేదని పేర్కొన్నారు. ముందుగా అటువంటి వారికి తగిన రీతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలని, అయినప్పటికీ మార్పు రాకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, గంజాయి అమ్మకాలపై ఉక్కు పాదం మోపాలని కోరారు. మద్యం సేవించి రాత్రి వేళల్లో కొందరు ద్విచక్ర వాహనదారు లు జనసంచారం అధి కంగా ఉన్న రోడ్లపైన వేగంగా వాహనాలను నడుపుతున్నారని, కొన్ని చోట్ల ద్విచ క్ర వాహనదారులు పోటీలు పెట్టుకుని అతి వేగంగా వాహనాలు నడుపుతున్న సంఘటనలు జరుగు తున్నాయని, అ టువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులను అధికారులు గాలికి వది లేశారని, సిసి కెమెరాలు పెంచాలని రాత్రి సమయాల్లో సెక్యూ రీటిని పెంచాలని కోరారు.



స్థల దాత తిరుపతి రెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలదాత,స్వాతంత్ర్య సమర యోధుడు గుత్తికొండ తిరుపతి రెడ్డి వర్ధంతిని ఘనంగా సోమవారం నిర్వహించారు. పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విద్యావంతులను చేయాలనే తపనతో పాఠశాలలో అదనపు గదులను నిర్మించడమే కాక,అనేక సంస్థ లకు భూదానం చేసి,భవనాలను నిర్మించిన మహోన్నతమైన వ్యక్తి గుత్తికొండ తిరుపతిరెడ్డి అని వక్తలు కొనియాడారు. స్వంత గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో అనేక ప్రజా ప్రయోజన పనులు ఆయన చేశారని కొనియాడారు. ప్రధానో పాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి పిసి చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి,కాశిపాడు మాజీ సర్పంచ్ మోహన రావు, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య,పెదకూరపాడు ప్రధానో పాధ్యాయులు రమణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కె.నరసింహారెడ్డి పాల్గొన్నారు.



యడ్లపాడులో అంగన్వాడీల ర్యాలీ

ప్రజాశక్తి - యడ్లపాడు

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన యడ్లపాడులో అంగన్వాడీలు సోమవారం ర్యాలీ నిర్వ హించారు. గర్భిణులు, బాలింతలకు సమావేశం నిర్వహించి తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించారు. తహశీల్దార్ విజయశ్రీ, ఇఒపిఆర్డి వరూధిని, ఎంఇఒ నాగరత్నం, సిడిపిఒ శాంత కుమారి, ఎసిడిపిఒ బి.నిర్మలరాణి, సూపర్వైజర్లు టి.పార్వతి, ఎం.జోజమ్మ, కె.వెంకటరమణ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవట్లేదు

- ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీదారులు
- ఫిర్యాదులు స్వీకరించిన అదనపు ఎస్పీ ఆర్ రాఘవేంద్ర

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ రాఘవేంద్ర పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగా దాలు, వైసిపి నాయకులు స్థలం ఆక్రమించారని, కన్న కొడుకులు ఇం టిని వాళ్ళ పేరు మీద రాయమని కొట్టి, చంపుతామని బెది రిస్తునట్లు, పంట పొలం పాడు చేశారని, ఉద్యోగం ఇప్పి స్తానని డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు, కుటుంబ తగాదాలు, అద్దెకు ఉండే వాళ్ళ సామాను ఇవ్వకుండా ఇబ్బంది పెడుతునట్లు మొదలగు సమస్యలకు సంబం ధించిన ఫిర్యాదులు అందాయి.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ ఆర్.రాఘవేంద్ర

కుమార్తె మృతికి కారకులను గుర్తించి శిక్షించండి


మృతురాలి కుమార్తెలు, అమ్మమ్మ పినపోతు మంగ

తమ కుమార్తె మృతికి కారకులైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మృతురాలి తల్లి పినపోతు మంగ, మృతురాలి భర్త చింతల శ్రీనివాస్ ఎస్పీ కార్యా లయంలో ఫిర్యాదు చేశారు. ఏడేళ్ల క్రితం కాకినాడకు చెం దిన దేవికి, వినుకొండ మం డలం ఏనుగుపాలెం గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్కు వివాహం చేశారు. ఈ ఏడాది మే 17న గేదెలు మేపేంఁకు వెళ్లిన దేవిని, గుర్తుతెలియనివ్యక్తులు చంపి గ్రామ సమీపంలో ఉన్న వాగులో పడేశారు. అదేరోజు సాయంత్రం ఏడు గంటలైనా దేవి ఇంటికి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పొలంలో గాలించారు. మరుసటి రోజు ఉదయం వాగులో దేవి మృతదేహం లభ్యమైంది. పోస్ట్ మార్టం నివేదికలో హత్యగా నమోదైంది. అనుమాని తులపై అల్లుడు కేసు పెట్టినా చర్యలు తీసుకోలేదని విచారణ జరిపి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

అకాడమీలో చెల్లించిన ఫీజు తిరిగి ఇప్పించండి


గోపి సాయినాథ్రెడ్డి

విశాఖపట్నం పెందుర్తి లోని మేజర్ డిఫెన్స్ అకా డమీలో మొదటి విడ తగా రూ .61 వేలు చెల్లించి అకా డమీలో చేరానని, అయితే, అక్కడి వాతావరణం తనకు సరిపడకపోవ డంతో తాను అనా రోగ్యం పాలు కావడంతో తిరిగి ఇంటికి వచ్చేశాను. అయితే, తీసుకున్న ఫీజు తిరిగి ఇవ్వకుండా డిఫెన్స్ అకా డమీ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని నకరికల్లు మండలం గుండ్లపల్లికి చెందిన గోపి సాయినాథ్రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తనకు న్యాయం చేయా లని కోరారు. తమది మధ్య తరగతి కుటుంబం అని, తన తండ్రి లారీ డ్రైవర్ అని సాయినాథ్రెడ్డి తెలిపారు.

పంట ధ్వంసం చేసి.. 40 సెంట్లు ఆక్రమించారు


శీలం గోవింద్

తనకు జరిగిన అన్యాయంపై నూజెండ్ల మండలం పోలీసులకు, రెవిన్యూ అధికారు లకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని నూజెండ్ల మండలం మృత్యుం జయపురానికి చెందిన శీలం గోవింద్ ఫిర్యాదు చేశారు. పెద్దల నుండి సంక్రమించిన భూమిలో కొంత భాగాన్ని గ్రామ రాజకీయ వివాదాల నేపథ్యంలో గ్రామానికి చెందిన టిడిపి నాయ కుడు సమీప బంధువు శీలం వెంకటేశ్వర్లు ఆక్ర మిం చాడని, ఆముదం పంట చేతికి వచ్చే సమ యంలో దానిని దున్ని చదును చేశాడని ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోలేదన్నారు.

తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వకపోగా దాడి


మర్రి కోటేశ్వరరావు

ఖర్చులు నిమిత్తం అప్పుగా తీసుకున్న రూ 1.30 లక్షలు ఇవ్వ కుండా సమీప బంధువులైన ఉల్లేరు రాంబాబు, అంజి, ఇబ్బం దులు పెడు తున్నారని ఇదేమని ప్రశ్నిస్తే విక లాంగుడినని కూడా చూడకుండా దాడి చేసి దూషిం చారని కారంపూడి మం డలం చిన్న గార్ల పాడుకి చెందిన మర్రి కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. దీనిపై కారంపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ తనకు న్యాయం జరగలేదని విచారణ జరిపి త్వరితగతిన న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఫిర్యాదు చేసినా రెండేళ్లుగా పోలీసులు పట్టించుకోవట్లేదు


శంకరశెట్టి సత్య నారాయణ

కుమారుడు అచ్చుయ్య చేసిన బాకీ కింద తన కష్టార్జితంతో కొను గోలు చేసిన 2.60 భూమిని రాజు పాలెం మండలం దేవరం పాడుకి చెందిన శంకరశెట్టి సత్య నారాయణ ఆక్రమించారని, ఇదేమని ప్రశ్నిస్తే దాడికి యత్నించారని దీనిపై విచా రణ జరిపి న్యాయం చేయాలని అదే గ్రామానికి చెందిన కుర్రా బ్రహ్మయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై రెండేళ్ల నుండి రాజుపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు.

డంపింగ్ యార్డుకు చేరని ఘనవ్యర్థాలు!

- గ్రామానికి సమీపంలోనే తగలబెడుతున్న వైనం
- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పొగ కాలుష్యం
- డంపింగ్యార్డు వినియోగించాలని ప్రజల వినతి



ప్రజాశక్తి - పెదకూరపాడు

మండల పరిధిలోని లగడపాడులో డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ ప్రతిరోజూ సేకరించిన ఘన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు చేర్చకుండా గ్రీన్ అంబాసిడర్లు గ్రామానికి సమీపంలోనే వేసి తగల బెడుతున్నారు. దీంతో, గ్రామంలోకి పొగ కాలుష్యం ప్రవాహంలా మారింది. పొగ కాలుష్యం కారణంగా ధం వలన ఊపిరితిత్తుల వ్యాధులు వస్తాయని ప్రజలు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు భయాందళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వం హయాం లో పంచాయతి అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, ప్రభుత్వం మారినా అధికారుల తీరు ఏమాత్రం మారలేదని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



సమీప ఇళ్లల్లో ప్రజ లను ఉక్కిరి బిక్కిరి చేస్తూ వివిధ రకాల వ్యాధులు సంక్రమించడానికి కారణం అవు తోంది. అతి సమీపంలోనే ప్రభుత్వ పాఠాశాల, ఉర్దూ పాఠశాల కూడా ఉన్నాయి. భరించ లేని పొగ, దుర్గం ఇకనైనా అధికారుల అలసత్వం వీడి.. పంచాయతి అధికారులు స్పందించి గ్రామంలోని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు చేర్చే విధంగా గ్రీన్ అంబాసిడర్లకు ఆదేశాలు ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆర్సిఎం పాఠశాలలో ఆర్జెడి తనిఖీ

ప్రజాశక్తి- పెదకూరపాడు

మండలంలోని పాటిబండ్ల లోని ఆర్.సి.యం హైస్కూల్ ను ఆర్జెడి .బి. లింగేశ్వర రెడ్డి సోమవారం ఆ పాఠశాలను తనిఖీ చేశారు. స్టూడెంట్స్ కిడ్స్, పదవ తరగతి విద్యార్థులు ఎలా చదువుతున్నారు, సిలబస్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తరగతిల వారీగా రోలు, నమోదు యాప్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పెద కూర పాడు మండల విద్యాశాఖ అధికారి టి.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి పాల్గొన్నారు.

విశ్రాంతి మందిరం పైఅంతస్తుకు శ్లాబ్ పనులు

ప్రజాశక్తి - యడ్లపాడు



మండలంలోని వైదవోలులోని పోలేరమ్మ తల్లి దేవ స్థానంలో భక్తుల సౌక ర్యార్థం నిర్మించిన విశ్రాం తి మందిరం పై అంతస్తుకు సోమవారం దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శ్లాబ్ వేశారు. పది లక్షల రూపాయలు వ్యయం కలిగిన ఈ శ్లాబ్ గ్రామ ప్రజలు, నక్క కోటేశ్వరావు సహ కారంతో నిర్మించారు. కార్యక్రమంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ ఈర్ల శివకుమార్, నక్క పోతురాజు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తన తీర్పును పున: సమీక్షించాలి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారతదేశపు అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఈనెల 1వ తారీఖున ఎస్సీ రిజర్వేషన్ కు సంబంధించి వెలువరించిన తీర్పును ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ దళిత విద్యార్థి సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, రత్నసాగర్ , గణేష్‌లు తీవ్రంగా ఖండించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను గురించి చర్చించేందుకు ఎన్ డి ఎస్ ఎఫ్ విద్యార్థి, పరిశోధక, అతిథి అధ్యాపక బృందాలు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథి అధ్యాపకులు మాట్లాడుతూ రిజర్వేషన్ విధానం వలన ఎస్సీలు లబ్ధి పొందడం అనేది కేవలం ఊహాజనితమే అని వాస్తవానికి ఎస్సీలను ఉప కులాలుగా వర్గీకరించి రిజర్వేషన్ ఫలాలను అందించడం వలన సరైన ప్రాతినిధ్యం పొందనీ వర్గాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రత్నసాగర్, కార్యదర్శి గణేష్ వైస్ ప్రెసిడెంట్ రత్న కిషోర్, స్కాలర్స్ హర్షవర్ధన్, పవనమూర్తి, శ్రావణ్, అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.



శారమ్మకు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాజారావు

చర్మకారులు, డప్పు కళాకారులకు రుణాలివ్వాలి

ఏపీ చర్మకార సేవా సంఘం మహిళా విభాగం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మంగళగిరి

నియోజకవర్గంలో ఉన్న 250 మంది చర్మకారులు, డప్పు కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం సమావేశం తీర్మానం చేశారు. సోమవారం మంగళగిరిలోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నియోజకవర్గ చర్మకార మహి ళల సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంల నియోజకవర్గ మహిళా విభాగం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీ కార్యవర్గంకు బుల్లా నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన నూతన కమిటీ వివరాలను మీడియాకు వెల్లడించారు. సంఘం నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలుగా పట్టణానికి చెందిన బుల్లా శారమ్మ ఉపాధ్యక్షురాలు నందిపాముల సునీత, ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సుశీల, కార్యదర్శి యర్రగుంట సుశీల, ఆర్గనైజింగ్ సెక్రటరీ బేతపూడి అచ్యుత, కోశాధికారి శ్రీమతి వేమూరి అంకమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ అమలు జరపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సమావేశం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కు ఆంధ్రప్రదేశ్ చర్మ కారుల సంఘం నియోజకవర్గ మహిళా విభాగం మద్దతుగా ఉంటుందని నూతన కార్యవర్గం ప్రకటించింది. కార్యక్రమంలో సంఘం నాయకులు నందిపాముల జోని బాబు, గొల్లపల్లి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు న్యాయాన్ని బతికించింది

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

సుప్రీం కోర్టు నేతృత్వంలోని ధర్మాసనం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు న్యాయాన్ని బతికించింది ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర మాదిగ లాయర్స్ ఫెడరేషన్ ఇన్‌చార్జి పుసులూరి జయరత్నం(జీవ) అన్నారు. 30 సంతవ్సరాల సుదీర్ఘ అలుపెరుగని పోరాటం ద్వారా పొందిన ఈ న్యాయవిజయానికి కారకులైన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు, పోరాటయోధులు మందకృష్ణమాదిగకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కోర్టు వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి గుంటూరు జిల్లా కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న మాదిగ లాయర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని పాలాభిషేకం చేశారు. ఈ పోరటానికి సహాయ సహకారం అందించిన ప్రధాన మంత్రి మోడీ, ఎపి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలిపారు. సుప్రీం



కోర్టు తీర్పును అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ ఎపి రాష్ట్ర అధ్యక్షులు వై.కె విశ్వనాథం, మాదిగ లాయర్స్ రాష్ట్ర నాయకులు సొపాటి కిషోర్‌బాబు, న్యాయవాదులు బి.ఎం.ఎస్.కుమార్, పి.ఆనంద్, టి.నాగరాజు, వై.అనిల్, టిడిపి లీగల్ సెల్ నాయకులు పి.కిషోర్, బిజెపి లీగల్ సెల్ నాయకులు బి.చంద్రశేఖర్, జనసేన న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చుండూరు అమరవీరుల వర్ధంతి సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చుండూరు అమరవీరుల 33వ వర్ధంతి, ప్రజా కవి గద్దర్ ఒకటవ వర్ధంతి సభ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు గుంటూరు స్థానిక బ్రాడీపేట కొరటాల భవన్లో దళిత బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరుగుతుందని సోమవారం వివిధ ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఉద్యమ కారులు, మేధావులు, ప్రజస్వామ్య వాదులు ఎస్‌సి,ఎస్‌టి, బిసీ, మైనార్టీ నేతలు పాల్గొనాలని కోరారు. ఈ సభకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింత గింజ చింత కింది ఖాసిం, ప్రొఫెసర్ సాహితీ విమర్శకులు, వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ జి సౌరయ్య సీనియర్ న్యాయవాది వైకె తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఐక్యవేదిక నాయకులు శిఖా సురేష్, పొలిటికల్ సెంటర్ కో ఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, భీమ్ భారత రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాశం, బిసి బహుజన ఫ్రంటు రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు దళిత ఉద్యమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా ప్రభుదాసు భీం సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం తదితరులు మాట్లాడారు.

జిఎంసి ఉద్యోగి నాగూర్‌మీరా మృతికి అధికారుల సంతాపం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్. నాగూర్ మీరా మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబానికి జిఎంసి తరపున అండగా ఉంటామని నగర కమిషనర్ (ఎఫ్‌ఎసి) ఎస్.హరికృష్ణ తెలిపారు. అనారోగ్య సమస్యలతో మృతి చెందిన నాగూల్ మీరాకు సోమవారం కమిషనర్, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ సి హెచ్.శ్రీనివాస్, విభాగాధిపతులు, అధికారులు సంతాపం ప్రకటిం చారు. నాగూర్ మీరా కుంటుంబానికి ఇప్పటికే మట్టి ఖర్చులు అందించామని, త్వరలో అందాల్సిన బెన్ఫిట్స్ అందించడానికి చర్యలు తీసుకుం టామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం చినకాకాని సబ్ స్టేషన్‌లో ఫెయిల్ అయిన 11కె.వి సిటి అత్యవసరముగా మార్చవలసి ఉన్నందున, మండలం లోని చిన కాకని, కాజ గ్రామములో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని డిఇ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించగలరని కోరారు.

ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించండి

గృహనిర్మాణంలో ఇబ్బంది పెడుతున్నారంటూ కాంట్రాక్టర్ ఫిర్యాదు

సబ్ కలెక్టర్ పిజిఆర్ఎస్‌లో ఎనిమిది పిర్యాదులు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో ఎన్నో సమస్యలున్నాయని, ట్రాఫిక్ అడ్వయిజరి కమిటీ సమావేశం నిర్వహించి కూడా రెండున్నరేళ్ళయ్యిందని, సమావేశం నిర్వహించాలని కోరుతూ పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొత్తం 8 అర్జీలు దాఖలయ్యాయి. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ స్వయంగా సందర్శకుల నుంచి అర్జీలు స్వీకరించారు. ట్రాఫిక్ అడ్వయిజరి కమిటీ సమావేశం ప్రతి ఆరునెలలకు ఒక సారి జరగాల్సి ఉండగా, రెండున్నరేళ్ళ నుంచి సమావేశం జరగలేదని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం అధ్యక్షులు దరిశి శివకోటేశ్వరరావు సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే జగనన్న కాలనీలు పెదరావూరు, సిరిపురం, నేలపాడు లేఔట్లలో గృహ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ ఎం.పున్నారావు సబ్ కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. గృహనిర్మాణ విషయంలో ముందుగా కుదుర్చుకున్న



సబ్ కలెక్టర్‌కు అర్జీ సమర్పిస్తున్న సంఘ సంభ్యులు

ఒప్పం దానికి భిన్నంగా మాజీ ఎమ్మెల్యే మనుషులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, పనులు నిలుపుచేయించారని, హౌసింగ్ అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని సబ్ కలెక్టర్‌కు వివరించారు. అడ్డంకులు తొలగిస్తే గృహ నిర్మాణం కొనసాగిస్తానని చెప్పారు. దీనిపై సబ్ కలెక్టర్ హౌసింగ్ డీఈ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఇవి కాక రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, పోలీసు శాఖలకు సంబందించి ఒక్కో ఆర్జీ చొప్పున, మున్సిపాలిటీకి సంబందించి రెండు అర్జీలు దాఖలయ్యాయి. సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీలను సంబందిత శాఖలకు పంపనున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. పిజిఆర్ఎస్‌లో వివిధ శాఖల అధికారులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కెఎల్‌యులో ఫైర్ మాక్‌డ్రిల్ శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిలోని ప్లానింగ్ మరియు డెవలప్‌మెంట్ విభాగం అధ్వర్యంలో సెక్యూరిటీ విజిలెన్స్ సిబ్బందికి మంగళగిరి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వై. వెంకటేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఫైర్ మాక్ డ్రిల్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణలో అప్రమత్తత యొక్క ఆవశ్యకతను వెంకటేశ్వరరెడ్డి వివరించారు. చిన్న నిర్లక్ష్యం పెను ప్రమాదాలకు దారి తీసి తీవ్రమైన నష్టాలను కలిగిస్తుందన్నారు. నిర్లక్ష్యాన్ని తగ్గించడంలో సమాజ మద్దతు యొక్క ప్రాముఖ్యతను అవసరమన్నారు. లేకుంటే ఆస్తి మరియు ప్రాణాలు రెండూ ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అగ్నిమాపక వర్గీకరణ, నివారణ చర్యలు మరియు సహాయక చర్యల మెళుకువలపై శిక్షణను అందించారు. అదనంగా ఆయన ఎల్ పిజి



సిలిండర్ పేలుళ్లతో సంబంధం ఉన్న ప్రమాదాలపై అవగాహనకల్పించారు. కార్యక్రమంలో వర్శిటి వైస్ ఛాన్సులర్ డాక్టర్ జి పార్ధ సారథి వర్మ, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జీ డీన్ డాక్టర్ కెఆర్.ప్రసాద్, అసోసియేట్ డీన్ లు డి. శేషి రెడ్డి, కెజె. బ్రహ్మ చారి, యూనివర్సిటీ ఫైర్ ఆఫీసర్ వై. మౌళి చంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకోసం ఎమ్‌టిఎంసిలో కంట్రోల్ రూం

నగరపాలక సంస్థ కమిషనర్ ఆలిం బాష

ప్రజాశక్తి - మంగళగిరి

ఎంటిఎంసి పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కార చర్యల దృష్ట్యా నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఆలిం భాష సోమవారం తెలిపారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయములో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు: 70939 12653, 08645-295192 ఏర్పాటు చేసి వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్ మెంట్ సెక్రటరీలతో పాటు ఇతర సచివాలయ సిబ్బందిని మూడు షిఫ్ట్‌లుగా (24/7) టర్న్ డ్యూటీలు కేటాయించామని ఆయన తెలిపారు. తద్వారా ప్రజల నుండి వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కార చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు.



కాజాలో పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కాజా గ్రామ పాడి రైతులకు సంఘం డైరీ మేనేజర్ పాతూరి ఆదినారాయణ అధ్యక్షతన బోనస్ పంపిణీ చేశారు. మొత్తం 183 మంది రైతులకు రూ.71,68,320లు బోనస్‌గా ఆరు శాతం రూ. 4,31,137 అందించినట్లుగా తెలిపారు. రైతులకు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిని చావా తారక రామారావు, ద్వితీయ బహుమతి మాణిక్యాల వెంకటేశ్వరరావు తృతీయ బహుమతిని మాణిక్యాల రాములయ్యలకు అందించి వారినీసందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉంగుటూరు బిఎంసి ఇంచార్జ్ ఆనందరావు, సూపర్వైజర్ శివకష్ణ, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, కాజా గ్రామ పాల కేంద్రం అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఉడత శ్రీరామమూర్తి డైరెక్టర్లు పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చేనేత రంగ సమస్యలు పరిష్కరించండి

మంత్రి సవితకు చేనేత కార్మిక సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత పరిశ్రమ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర చేనేత, జౌళి శాఖామంత్రి సవితను తాడేపల్లి బైపాస్ రోడ్డులోని మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం చేనేత సమస్యల పట్ల జరిగిన చర్చల్లో మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబు కూడా తెలియజేసి ఈ సమస్యలను పరిష్కారము చేసే విధంగా తగిన కృషి చేస్తామని, అలాగే జీఎస్టీ రిజర్వేషన్ యాక్ట్ ను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసి జీఎస్టీ ని ఎత్తివేసే విధంగా రిజర్వేషన్ యాక్ట్ ను కఠినంగా అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుగిడే మాధవస్వామి, పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు జొన్నాదుల భారతి, కడుపు కన్నయ్య, పంచుల హరి, సహాయ కార్యదర్శులు గొట్టుముక్కల బాలాజీ తదితరు పాల్గొన్నారు.

సౌజన్యకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ పరిశోధకురాలు పి. సౌజన్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిందని రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ బి.హరిబాబు పర్యవేక్షణలో "ఇమడజిలోయం అయానిక్ ద్రవాలు మరియు ఎంచుకున్న సేంద్రియ ద్రావకాల మధ్య పరమాణం పరస్పర చర్యలపై అధ్యయనం అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకు గాను పిహెచ్‌డి డిగ్రీ ని ప్రధానం చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు సౌజన్యకు అభినందనలు తెలిపారు.

8న టిజెపియస్ కాలేజీలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కళాశాలలో ఈనెల 8వ తేది ఉదయం 10 గంటలకు పి.జి క్యాంపస్ కాన్ఫరెన్స్ హాల్లో కళాశాల ప్లేసెమెంట్ వారి ఆధ్వర్యంలో మ్యాజిక్‌బస్ వారి సహకారంతో ప్రముఖ జెన్పాక్ట్ కంపెనీ నిర్వహణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె. వి. బ్రహ్మం, ప్రిన్సిపాల్ మేజర్ ఏబిపి మనోహర్ తెలియచేశారు. ఈమెగా జాబ్ మేళాలో 2020 నుండి 2024 వరకు డిగ్రీ, పిజి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు అని, జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు వారి రెజ్యూమ్ తెచ్చుకోవాలని, నిర్దేశించిన సమయానికి కళాశాలకు రావాలని తెలిపారు. ఇతర కళాశాలలో డిగ్రీ, పి.జి, బి.టెక్. ఎంటెక్ పూర్తి చేసినవారు కూడా పాల్గొనవచ్చన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆకర్షణీయమైన ప్యాకేజి ఉంటుందన్నారు.

రూ.కోటితో కలెక్టరేట్ రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



స్థానిక కంకరగుంట నుంచి నగరంపాలెం వరకు 700 మీటర్ల రహదారి నిర్మాణంకు రూ.కోటితో పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్లను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని దీని వలన రోడ్డు ప్రమాదాలు ప్రజల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. రోడ్ల నిర్మాణంలో కూడా నాణ్యత లేకుండా చేశారని ఆమె ధ్వజమెత్తారు. వైసిపి వారు వేసిన రోడ్లు ఆరు నెలలకే పాడయ్యాయని తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు అలాగే క్వాలిటీ కంట్రోల్ విషయంలో సమీక్ష చేయబోతున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. లామ్ వర్ధన్ రావు,సాధు రాజేష్ ఉమామహేశ్వరి, గంటా మౌళిక, గంటా పెద్దబ్బాయి, సుఖవాసి శ్రీనివాస్ రావు,లామ్ నవమి, సైదా,దళవాయి కిషోర్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణ జరగాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజు నిర్దేశిత సమయంలో చేయాలని నగర కమిషనర్ (ఎఫ్‌ఏసి) ఎస్.హరికృష్ణ ప్రజారోగ్య అధికారులను, కార్యద ర్శులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ అమరావతి రోడ్, గోరంట్ల, బృందావన్ గార్డెన్స్, కొరెటెపాడు, లక్ష్మీపురం, బ్రాడీపేట, పట్టాభిపురం ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, కార్మికులు, కార్యదర్శుల హాజరును పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులు ప్రతిరోజు ఒకే సమయానికి చెత్తసేకరణ చేయాలని, ప్రజలకు కూడా సదరు సమయంపై అవగాహన కల్పించడం ద్వారా వారు రోడ్లమీద, కాల్వల్లో వేయకుండా ఉంటారన్నారు. అలాగే శానిటేషన్ కార్యదర్శులు తప్పనిసరిగా ఉదయం నిర్దేశిత సమయానికి విధులు హాజరు కావాలన్నారు. కమర్షియల్ సంస్థలు ప్రజారోగ్య కార్మికులు రోడ్లు శుభ్రం చేసిన అనంతరం షాప్‌లు శుభ్రం చేసుకొని, వ్యర్థాలను రోడ్ల మీద వేస్తున్నారని, వారికి తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని తెలియచేయాలన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్ వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యాచరణ ప్రణాళిక ఉండాలని, ప్రధాన రహదారులు ఉదయం 7 గంటలకల్లా శుభ్రం చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఎంహెచ్‌ఓ మధుసూదన్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 182 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజల నుండి అందే ఫిర్యాదులను గడువులోగా పరిష్కారం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.గంగరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, డియంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శిరీష వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 182 అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు మాట్లాడుతూ ప్రజల నుండి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఇంతకు ముందు చేసుకున్న దరఖాస్తుకు సంపూర్తిగా పరిష్కరించని కారణంగా కొంత మంది తిరిగి సోమవారం దరఖాస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా ఇకపై జరగకుండా పూర్తి స్థాయిలో ఫిర్యాదును పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదులు తిరిగి రీఓపెన్ కాకుండా అధి కారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం తర్వాత సదరు ఫిర్యాదు దారుడికి సమాచారం అందించాలన్నారు. నిర్ణీత గడువులోపు ఫిర్యాదులు పరిష్కరించి బియాండ్ ఎస్-ఎల్ఎలోకి వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గడువు ముగిసే 24 గంటలలోపే ఫిర్యాదులను పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.గంగరాజు సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు, జిల్లా ఉపాధి అధికారి రఘు, ఎల్‌డియం

పిడుగుపాటు పరిహారం ఇవ్వాలి..



పిడుగుపాటుకు గురై, చేతిని పోగొట్టుకున్న తనకు ఏడాది నుండి ఆర్థిక సాయం అందక అధికారులను చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవట్లేదని మేడికొండూరు మండలం, డోకిపర్రు శాంతిగర్‌కు చెందిన బాధితుడు గుంజి వీరాంజనేయులు గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశాడు. 2023 జులై 7న సాతులూరులో కూలిపనులు చేసుకుంటున్న తరుణంలో వర్షం, మెరుపులు, ఉరుములతో కూడిన గాలివానతో నామీద పిడుగుపడిందన్నారు. ఆసమయంలో ప్రభుత్వం వారికి విన్నవించినా ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుతం నాకు ఇల్లు గడవటం కష్టంగా ఉందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి నాయకులు సాయం అందించాలని కోరాడు.

జిఎంసి గ్రీవెన్స్‌కు 65 ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

నగరంలో స్థానిక సమస్యలు సత్వర పరి ష్కారానికి వివిధ విభాగాల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని నగర కమిషనర్ ఎస్.హరికృష్ణ స్పష్టం చేశారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులతో మాట్లా డుతూ అలాగే ప్రజల నుండి అందే అర్జీలను ఆర్థిక, ఆర్థికేతర అంశాల వారీగా విభజించి, ఆర్థికేతర అంశాలను నిర్దేశిత కాలపరిమితితో పరిష్కారం చేయాలన్నారు. ఫైనాన్స్ అంశాల పరిష్కారం కోసం విభాగాధిపతుల సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి సోమవారం అందే ఫిర్యాదుల పరిష్కార నివేదికను తదుపరి వారం జరిగే సమావేశంలో అందించాలన్నారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ విభాగాలకు సంబంధించిన 65 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ శ్యాంసుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్, ఉపాసెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే తహశీల్దార్

ప్రజాశక్తి-తెనాలిరూరల్



ప్రతి వారం జరిగే ప్రజ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం తెనాలి తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ గోపాలకష్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రజలు వద్దకే ఎమ్మార్వో కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్ర మంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గున్నారు.

బిడ్డకు తల్లిపాలు శ్రేష్టం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు జిజిహెచ్‌లో



తాడేపల్లిలో

తల్లి పాలను అందించేందుకు ఆధునిక మహిళలు వెనుకడుగు వెయ్యడం బాధకరమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం తల్లి పిల్లల వార్డులో ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థినులు తల్లి పాల ఆవశ్యకత గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ తల్లి ముర్రు పాల ద్వారా శిశువు కు అమృతాన్ని పొందుతారని ఆయన చెప్పారు. దీనివల్ల శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆయన తెలిపారు. అటు తల్లి కి ఇటు బిడ్డకు ఎంతో శ్రేయస్కారం అవుతుందని ఆయన చెప్పారు. తల్లి పాలను ఇవ్వడం వల్ల శిశువుకు ఆరోగ్యకరంగా ఉంటారని ఆయన అన్నారు. తల్లి పాల ఆవశ్యకత గురించి మహిళల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థినులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ, పద్మజ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమైనవని ప్రకాష్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆర్.మానస మంజరి చెప్పారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన ప్రకాష్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యంతో పాటు శక్తిని ఇస్తాయని చెప్పారు. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు తాగించాలన్నారు. మహిళల్లో ఎక్కువగా వచ్చే రొమ్ము కేన్సర్‌ను తల్లిపాలు ఇవ్వడం ద్వావరా అరికట్టవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్‌నగర్ పిహెసి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.సుజాత, వి.లత, ఎ.కోటేశ్వరమ్మ, వై.కుమారి పాల్గొన్నారు.